# దగాపడ్డ ప్రిస్టేజ్!



* రచన : శ్రీమతి వి. ఎస్. ఆర్. శారదాంబ *

కోర్టు పనిమీద హైదరాబాద్ వచ్చి నాలుగు రోజులు అవుతూంది. లాయర్‌గారికోసం తిరగడానికి, మాట్లాడ్డానికే సరిపోతుంది. అయినా ఇంకా పని పూర్తికాలేదు. తల నొప్పిగా వుండటంతో అలా వెళ్ళి కాఫీ తాగి వస్తామని బయలుదేరదీశాను నా ఫ్రెండ్ వెంకటేశాన్ని కూడా. ఇద్దరము రూం లాక్‌చేసి అంతా బయలుదేరాం.

"నమస్తే సార్! బాగున్నారా?" అన్నాడు నన్ను చూసి ఒక అపరిచిత వ్యక్తి. నా ప్రక్కనున్న వెంకటేశానికి నమస్కారం చేయలేదు. అతను పల్లెటూరి వ్యక్తిలాటోడి. అతని పంచెకట్టు చూసి నమస్కారం చేయలేదు. నేనెలాగయినా ఉద్యోగస్థుణ్ణి కదా? నాకు కొంచెం రెస్పెక్ట్ ఇచ్చాడనిపించి గర్వంగా ఫీలయ్యాను.

"ఆ...నమస్తె-నమస్తె" అన్నాను.

"ఏ వూరు సార్ మనది. మిమ్మల్ని బాగా ఎరిగినట్టు కూడా వుంది" అన్నాడు ఆ అపరచిత వ్యక్తి.

"మాది రామాపురం" అన్నాను నేను.

"రామాపురమా? అరే! మాది అదే వూరే సార్. అదే అప్పటినుంచి చూస్తున్నా. మిమ్మల్ని చూసినట్టే వుందని అనుకుంటున్నా. నన్ను చూశ్శేదా సార్ మీరు ఆ వూర్లో? ఆ బజార్‌నుంచి ఈ బజార్‌కు తిరిగే వాళ్ళు ఆ వూర్లో మీకు బాగా తెల్సిన వాళ్ళెవరు సార్?"

చెప్పాను కొన్ని పేర్లు.

"ఓ వాళ్ళందరూ నాకు తెల్సు సార్! మీరు చెప్పారే గుర్నాధం వారి మేనత్త కొడుకు బావమరిది చెల్లెలికి మా మేనత్త కూతురు ఆడబిడ్డ మరిదిని ఇచ్చాం" ఎవరివో గుర్తులేదు కాని, ఒక పెండ్లింట్లో కూడ మనమందరమూ కలిసాం సార్!

"ఏం వరుసలో. ఏంపెండ్లింట్లో నాకు ఒక్కటీ జ్ఞాపకం రావడంలేదు. వీణ్ణి ఎక్కడ చూసిన జ్ఞాపకంలేదు. అయినా వీడంత సంబంధాలు కలిపి చెపుతుంటే, నిజం కాకుండా వుంటుందా? నీ వెవరో గుర్తురాలేదు అంటే గౌరవంగా వుండదూ అనుకున్నాను మనసులో."

"ఏం సార్ ఏదో ఆలోచిస్తున్నారు?"

"ఆ...ఆ...ఏంలేదు అదే నిన్ను బాగా ఎరిగినట్టుందే అని నేనూ అనుకుంటున్నానోయ్. ఆ...బాగున్నావా? భార్యా, పిల్లలు అంతా క్షేమమేనా? ఎక్కడ వుంటున్నావు ఏం కథ?"

"ఉప్పల్‌లో ఉంటున్నా సార్. ఇక్కడ పనివుంటే వచ్చా. అదిగో ఆ ఇంట్లో వుంటే ఆవిడ నన్ను పిల్చి నూరు రూపాయల నోటు వుంది. మీ దగ్గర చిల్లరుంటే ఇస్తారా అని అడిగింది. నా దగ్గర నలభై రూపాయలే ఉన్నాయ్! పాపం ఇంట్లో మగవాళ్ళెవరూ లేరట. నేను ఎవరన్నా తెలిసిన వాళ్ళు కన్పిస్తే అడుగుదామని ఇలా వస్తున్నా మీ దగ్గ రేమన్నా వుందా సార్!" అన్నాడు.

వాడు చూపిన ఇంటివైపు చూశా. వాకిలి కొద్దిగా తెరచి వుంది.

ఆ చూస్తానుండు అని జేబులో వెదికాను. ఒక్క యాభై రూపాయలు మాత్రం వుంది.

"ఒరే వెంకటేశం నీ దగ్గరేమన్నా డబ్బుందేంరా?" అన్నాను వానివైపు చూసి.

అంతవరకు మా సంభాషణ ఆలకిస్తున్నాడు వాడు.

"చూస్తానుండ్రా" అని జేబులోనుండి డబ్బు తీశాడు.

ఆత్మీయులు శ్రీ రాఘవాచారిగారికి!
నమస్సుర!

మీ నిర్విరామ కృషి. నిరాటంక సాహిత్యసేవ, 'కథాంజలి' స్వర్ణోత్సవ సంచికకు ప్రాణాధారమైనాయి! మీ కివే నా అభినందన వందన శ్రీ చందనాలు.

మీ రాధేయ
హిందీ పండిట్—పందిల్లపల్లి

చిల్లల దండిగానే వుంది వానిదగ్గర. తీసి రెండు యాభై రూపాయల నోట్లు ఇచ్చాడు నా దగ్గర.

"ఆ ఇదిగో తీసుకెళ్ళి ఇవ్వు" అన్నాను నేను వాని చేతి కిస్తూ.

"ఆ...ఇచ్చి మీకు డబ్బు తెచ్చిస్తాను సార్!" అని వెళ్ళాడు.

మేము ఆ ఇంటి వైపే చూస్తున్నాము. కొద్దిగా వాకిలి తెరచి వుంది. వాడేదో మాట్లాడుతున్నాడు. మాకేమీ విని పించలేదు. మళ్ళీ వచ్చాడు మా దగ్గరికి.

"ఇచ్చావా? ఏది వంద రూపాయలు?" అన్నాడు వెంక టేశం ఆత్రంగా. పాపం వాని డబ్బు కదా?

"ఆ...ఇదిగోండి మీ వంద. సార్...సార్ ఇంకొక రెండువందలకు ఆవిడకు చేంజ్ కావాలట. పాపం ఇవ్వండి సార్! ఒంటరి ఆవిడ వున్నట్టుంది" అన్నాడు.

"ఒరే వెంకటేశం, నీ దగ్గర ఎలానూ చిల్లర వుందిగా చిల్లరంతా పెట్టుకొని ఏం చేస్తావురా? ఎక్కడైనా పడిపో వచ్చు. చిల్లరిచ్చి వందరూపాయల నోట్లు పెట్టుకో అన్నాను వేంకటేశంతో.

"నేనివ్వనురా చిల్లరుంటే మంచిదే కదా?"

'ఒరే! ఎందుకురా అట్లా చస్తావ్ ఇవ్వడానికి. పాపం ఆడకూతురు అడిగిందట ఇచ్చేయరాదా' అన్నాను కోపంగా.

'సరే! ఇదిగో తీసుకో' బాధగా తీసిచ్చాడు పాపం వెంకటేశం.

'ఎందుకు సార్ అట్లా బాధవడ్తారు. ఇదుగో ఇప్పుడే తెచ్చిసాను మీ డబ్బు.'

మళ్ళీ వెళ్ళాడు వాడు ఆ ఇంటివైపు. లోపలున్న ఆవి డతో భలే మాట్లాడుతున్నట్టుంది వాని వాలకం చూస్తే. మళ్ళీ మా వైపు వచ్చాడు.

'సార్...సార్! ఆవిడ మిమ్మల్ని చూసి మీ సహా యానికి థ్యాంక్స్ చెప్పమంది. అంతేకాదు సార్ మీకు కాఫీ తెచ్చివ్వమంది. డబ్బు కూడ ఇవ్వబోయింది. ఎందు కమ్మ నేను తెచ్చిస్తానులే అని వచ్చాను' అన్నాడు వాడు.

'మరి డబ్బేది?' అన్నాడు వెంకటేశం ఆత్రంగా! 'అబ్బ తెచ్చిస్తాను లేవయ్యా' ముందు మీకు కాఫీ తేవాలా? టీ తేవాలా? చెప్పండి.

'అబ్బే...ఎందుకులేవయ్యా ఇప్పుడు కాఫీ' అన్నాడు నేను మొహమాటపడ్తూ.

'అలాగంటే ఎలా సార్, ఒక్కనిముషంలో కాఫీ తెస్తా' అని తాను వేసుకొచ్చిన సైకిల్‌లో వెళ్ళాడు. అంతే అప్పుడు వెళ్ళిన వాడు మళ్ళీ ఒట్టు.

కనీసం రెండు గంటలు చూశాం వాని కోసం. ఇంత సేపూ వెంకటేశం ఆ ఇంటి దగ్గరికి పోయి డబ్బు తెమ్మని సణుగుతూనే ఉన్నాడు. వాని భయం వానిది. కాని వాడు భయపడినంతా అయ్యింది. 2 గంటలు చూసి ఎలానూ కాదని ఆ ఇంటికి వెళ్ళి బయటినుంచి పిలిచాం. ఎవ్వరూ పలక లేదు. బయటికి రాలేదు.

ఏంటబ్బా అని తలుపు తోసి చూశాం. ఏముంది ఖాళీ రూం పై అంతస్థుకు వెళ్ళటానికి స్టెప్స్‌తో మమ్మల్ని వెక్కిరించింది. మరి ఇంతసేపు వాని మాటలూ, చేష్టలూ అన్నీ నాటకమేనా? అమ్మో ఎంత మోసపోయాం!

ఇక వెంకటేశం ముఖంలో నెత్తురుచుక్క లేదు. మళ్ళీ రోజు వాడు కన్పిస్తాడేమోనని ఆ స్థలానికే వెళ్ళాం. కాని వాడు కన్పించలేదు. ఇలాంటి మోసగాళ్ళు ఈ మహా నగరంలో ఎంతమందో కదా? మోసపోయిన వాళ్ళం తెలివి తక్కువ వాళ్ళం అంతే అనుకోవాలి. ఉద్యోగస్తుణ్ణి నేనూ మోసపోయానంటే నా ప్రిస్టేజి ఏమి కావాలి. అనుకొని–

'ఒరే వెంకటేశం ఈ సంగతి ఎక్కడా చెప్పకురా' అని వాడ్ని వేడుకొని ఆ రెండు వందలు నేనే ఇచ్చుకున్నా. ఏం చేయాలి? నా ప్రిస్టేజి కోసం. *